క్లుప్తంగా

నేడు రాయవరంలో 'జగనన్నకు చెబుదాం'

రాయవరం: రాయవరంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. స్థానిక మూర్తినీడి వెంకట సూర్యనారాయణమ్మ ఏసీ ఫంక్షన్ హాలులో ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లా ముఖ్య అతిగా పాల్గొంటారని, ప్రజలు సమస్యలపై వినతిపత్రాలు అందించవచ్చునని, ప్రజలకు మేలు చేసే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం రూరల్: మండలంలోని 33/11 కేవీ చోడవరం సబ్‌స్టేషన్ 11 కేవీ రూరల్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.విజయానంద్, ఏఈ మేడిశెట్టి వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫీడర్ మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపు నిమిత్తం ఓదూరు, నరసాపురపుపేట, యనమదల, అంబికపల్లి అగ్రహారం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కె.గంగవరం: మసకపల్లి ఫీడర్ వద్ద మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరారం కలుగుతుందని ఈఈ విజయానంద్ తెలిపారు. మసకపల్లి, భట్లపాలిక, కుడుపూరు, పేకేరు, తాళ్లపోడు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదన్నారు.

వెలగతోడు ఫీడర్ పరిధిలో..

మండపేట: మండలంలోని వెలగతోడు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్టు ఈఈ విజయానంద్ తెలిపారు. వెలగతోడు, పాలతోడు, మెర్నిపాడు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిచిపోతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని విజయానంద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.

ఎంపీ బోస్ పరామర్శ



రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: అన్నాయిపేట మాజీ సర్పంచ్ పెమ్మిరెడ్డి రామకృష్ణ ఈ నెల 1న మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ గురువారం పరామర్శించారు. కాజులూరు, రామచంద్రపురం జెడ్పీటీసీ మాజీ సభ్యులు యాళ్ల ప్రకాష్, ఇంత సంతోషం, వైద్యుడు రాంబాబు తదితరులు పెమ్మిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, పెమ్మిరెడ్డి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నలుగురి అరెస్ట్

రాజోలు: యానాం నుంచి మద్యం తరలిస్తున్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నలుగురిని అరెస్ట్ చేశామని రాజోలు ఎస్ఈబీ అధికారి రఘు గురువారం తెలిపారు. భీమవరానికి చెందిన ముగ్గురు, కాజా గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని శివకోడులాకు వద్ద అదుపులోకి తీసుకుని సుమారు రూ. 45 వేల విలువ చేసే మద్యం సీసాలు, కారు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బీసీలకు అండగా సీఎం జగన్



ఎమ్మెల్సీ కుడుపూడిని అభినందిస్తున్న గెద్దాడ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

మలికిపురం: సీఎం జగన్ ప్రభుత్వం బీసీలకు అండగా ఉంటుందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. గురువారం మలికిపురం విచ్చేసిన ఆయనను స్థానిక వైఎస్సార్ సీపీ, బీసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కీలక భూమిక పోషిస్తున్నారని అన్నారు. అన్ని వర్గాలకూ ప్రభుత్వ ఫలాలు అందాలన్న దృఢ సంకల్పంతో సీఎం జగన్ ప్రణాళికాబద్ధంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లోనూ సీఎంగా జగన్‌నే ఎన్నుకుందామని కుడుపూడి పిలుపునిచ్చారు. డాక్టర్ గెద్దాడ నాగేశ్వరరావు, బీసీ సాధికార సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుబ్బల బాబ్జి, రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి ఉమ, నాయకులు గెద్దం తులసీభాస్కరరావు, సొసైటీ చైర్మన్ చెల్లుబోయిన బుచ్చియ్య మాష్టారు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



సత్యవాడ సమావేశంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. సత్యవాడ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దకే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా అందిస్తుందన్నారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, సర్పంచ్ సలాది శ్రీను, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, వైద్యులు మాణిక్యం పాల్గొన్నారు.

తాతపూడిలో..

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మహిళలు 283 మంది, పురుషులు 221 మొత్తం 504 మందికి వైద్యసేవలందించారు. గ్రామ సర్పంచ్ గూటం శ్రావణ అధ్యక్షతన నిర్వహించిన శిబిరంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు జుత్తుక వెంకటలక్ష్మి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఆరోగ్య సురక్ష ప్రయోజనకరమన్నారు. శిబిరంలో అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎన్‌ఎస్‌డీ రత్నకుమారి, వైద్య నిపుణులు జీవీ గీతాంజలి, చిట్టూరి రాకేష్ కృష్ణ, కె.రామలక్ష్మి, ఎస్‌వీవీ సత్యనారాయణ వైద్యసేవలందించారు. మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి డా.పి.రత్నకుమారి ఆధ్వర్యంలో శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జుత్తుక మల్లిఖార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



తాతపూడి శిబిరంలో లబ్ధిదారుకు కేస్ షీట్‌ను అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ



చెల్లూరు శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్ తదితరులు

చెల్లూరులో..

రాయవరం: చెల్లూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ పాలిక రాఘవ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తుందన్నారు. వైద్యులు సీహెచ్.రమ్యశ్రీ, జీఎం చంద్రకుమారి, డీవీఎస్ఎన్‌రెడ్డి, కన్యాకుమారి 528 మందికి వైద్యసేవలు అందించారు. ఇందులో 82 మంది నేత్ర వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుద్దాల రాంబాబు, ఎంపీటీసీలు వైట్ల వీరవేణి, వైఎస్సార్‌సీపీ నేతలు పాలిక గోవిందు, నల్లమిల్లి వెంకటరెడ్డి, పిల్లి సుబ్రహ్మణ్యం, పంపన వెంకటేశ్వరరావు, రిమ్మలపూడి రాంబాబు, నేరెళ్ల అశోక్, దొండపాటి లక్ష్మణరావు, చిక్కాల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

జగన్, తోట నాయకత్వంలోనే పనిచేస్తాం

రాయవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తుల నాయకత్వంలో పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెంటూరుకు చెందిన సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఉప సర్పంచ్ నున్న కృష్ణప్రదీప్‌కుమార్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి రాధాకృష్ణలు తెలిపారు. మండలంలోని వెంటూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనం వెంట లేని జనసేన నాయకులు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వారు తప్పుబట్టారు. ఈ నెల 3వ తేదీన వెంటూరు గ్రామానికి జనసేన నాయకుడు వేగుళ్ల లీలాకృష్ణ, ఆయన అనుచరులు వచ్చారన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను పార్టీలో చేర్చుకుని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు జనసేనలో చేరారంటూ సోషల్ మీడిఆయా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఏ ఒక్క వైఎస్సార్ సీపీ నాయకుడు కాని, కార్యకర్తకాని జనసేనలో చేరలేదన్నారు. ఆయా సామాజిక వర్గాల ఆలయాలకు వచ్చినప్పుడు ఎవ్వరినైనా గౌరవించడం సంప్రదాయంగా వస్తుందన్నారు. పచ్చని పల్లెల్లో ఐక్యంగా సాగుతున్న కులాల మధ్య చిచ్చు పెట్టేలా ఎవరు ప్రయత్నించినా సహించేది లేదన్నారు. విలేకరుల సమావేశంలో ఎంపీటీసీ వాసంశెట్టి విజయకుమార్, వెంకట్రావు, కృష్ణప్రదీప్, సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- 17వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం

మండపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో క్షేత్రస్థాయిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రతి ఇంటికీ ప్రభుత్వ లబ్ధి చేకూరుతోందని ఆయన పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పార్టీ నేతలు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు, యువనేత తోట పృథ్వీరాజ్ తదితరులతో కలిసి 17వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడిక్కడే మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌తో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్సీ తోట పర్యటనకు వార్డులో మంచి స్పందన లభించింది. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎక్కడికక్కడ లభిస్తున్న ప్రజాదరణే అందుకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ తోటకు వార్డులో పార్టీ నేతలు ఓగిరాల దేవి, జిన్నూరి సాయిబాబా, దుగ్గిరాల రాంబాబు, పసుమర్తి సురేష్, గణేష్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, మేకా శ్రీనివాస్, పాలంగి కమల, దుగ్గిరాల ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కోలంకలో గడప గడపకూ..

కాజులూరు: కోలంకలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పథకాల ద్వారా ప్రజలకు కలిగిన లబ్ధిని వివరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ హాజరు కావాలన్నారు.

'చంద్రయాన్' అవగాహన సదస్సుకు డిగ్రీ విద్యార్థులు



అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మండపేట: రాజమహేంద్రవరంలో ఇస్రో సంస్థ ప్రతినిధులు నిర్వహించిన చంద్రయాన్ అవగాహన సదస్సుకు మండపేట డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీలో కళాశాలకు చెందిన యు.గుణ, శేషలత, భారతీరమణ, ప్రవంతి వివిధ బహుమతులు గెలుచుకున్నట్టు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కన్వీనర్ డా.జె.నెహ్రూనాయక్ తెలిపారు. తమ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆనందరావు, అధ్యాపకులు జె.వీర్రాజు తదితరులు అభినందించారు.

భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిత్యాన్నదాన పథక భవన నిర్మాణానికి భక్తుల నుంచి భారీగా విరాళాలు అందుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. రావులపాలేనికి చెందిన డి.భాస్కర నారాయణమూర్తి, వెంకట దుర్గాభవానీ దంపతులు రూ.10 వేలు, రాజమహేంద్రవరానికి చెందిన డి.శ్రీలక్ష్మీకుసుమ రూ.10,116 అందించారన్నారు.

స్వచ్ఛమైన నీరందిస్తాం..



నరసాపురపుపేటలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- ట్యాంకుల నిర్మాణానికి భూమిపూజ

రామచంద్రపురం రూరల్: ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని తోటపేట, నరసాపురపుపేట గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా వాటర్ ట్యాంకుల నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు కోరపు కామరాజు, చాట్రాది వీరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అల్లం నాగసంధ్య, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, నాయకులు టేకుమూడి సత్యనారాయణ, కొప్పిశెట్టి ఏడుకొండలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

స్థానిక శీలంవారి సావరానికి చెందిన కల్లుగీత కార్మికుడు కాశా చిన సత్యనారాయణ ఇటీవల చెట్టు పైనుంచి పడిపోయి గాయాల పాలవ్వడంతో మంత్రి వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. బాధితుడి కుటుంబ సభ్యులు, శెట్టిబలిజ సంఘ పెద్దలు, కల్లు గీత కార్మికులతో మాట్లాడుతూ చిన సత్యనారాయణ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆర్థిక సాయం అందేలా చూస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. నియోజకవర్గ శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు నరాల ఏడుకొండలు, కార్యదర్శి పలివెల నాగరాజు, సర్పంచ్ కట్టా గోవిందు, పార్టీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఆలయ నిర్మాణాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: నియోజకవర్గానికి నూతనంగా మంజూరైన 23 రామాలయాల నిర్మాణాలను ఆలయ కమిటీలు త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. పాలతోడులోని బీసీపేటకు రామాలయం మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శెట్టిబలిజ సంఘం నాయకులు గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ తోటను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పనులు పూర్తయిన వెంటనే బిల్లుల విడుదలకు కృషి చేస్తానన్నారు. ఆయా గ్రామాలకు చెందిన ఆలయ కమిటీలు పనులు మొదలు పెట్టాలని సూచించారు. ఇంకా ఎక్కడైనా అవసరమైతే ఆలయాల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట తెలిపారు. వైఎస్సార్ సీపీ నేత గారపాటి అశోక్‌కుమార్, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పిల్లా అరవరాజు, ఉప సర్పంచ్ గుత్తుల సూర్యనారాయణ, పిల్లా సూరిబాబు, సంఘ నాయకులు గుత్తుల వెంకటరమణ, గుత్తుల శివకుమార్, మట్టపర్తి గోవిందు, పితాని గోవిందు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ తోటను సత్కరిస్తున్న పాలతోడు శెట్టిబలిజ సంఘ నాయకులు, తదితరులు

ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలకు రేపు తుది గడువు

రాయవరం: వివిధ ప్రభుత్వ/ప్రైవేట్ ఐటీఐల్లో 2023–24 విద్యా సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీ కోసం ఐదవ విడత ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ విషయాన్ని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. అర్హత కలిగి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అభ్యర్థి ఆన్‌లైన్‌లో ఏ ఐటీఐనందు చేరదలచారో ఆ ఐటీఐను తప్పనిసరిగా ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంపిక చేసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట ఐటీఐలకు ఒక దరఖాస్తు సరిపోతుందన్నారు. ఆన్‌లైన్లో నమోదు చేయించుకున్న విద్యార్థులు తమ దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని, అప్రూవల్ చేయించుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 7తేదీ.59 గంటలలోగా అందజేయాలన్నారు. 8న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 9న ప్రభుత్వ ఐటీఐల్లో, 10న ప్రైవేట్ ఐటీఐల్లో జరిగే ప్రవేశాలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే 08842348182 లేదా 9701215511 నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

ఘనంగా అన్నసమారాధన

కాజులూరు: గొల్లపాలెం శివారు చీకట్లవారిపేట, ఊడావారిపేటలలో అన్నదాన కార్యక్రమం జరిగింది. వినాయక నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని గురువారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.



గొల్లపాలెం శివారు చీకట్లవారిపేటలో అన్న సమారాధనలో భక్తులు

పట్టించుకోక.. కంట్లో ఊక



గొల్లపాలెం, యానాం రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా ఊక లారీ ప్రయాణం

- నిబంధనలకు విరుద్ధంగా లారీల ప్రయాణం
- అధికారులు స్పందించాలని ప్రజల మొర

కాజులూరు: ఎవరూ పట్టించుకోక.. అడిగేవారు లేక కొందరి ఇష్టారాజ్యం అయ్యింది.. రహదారిపైకి వెళ్తే కష్టాలు వెంటాడుతున్నాయి.. రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా ఊక లోడుతో యథేచ్ఛగా తిరుగుతున్న లారీలు, ట్రాక్టర్లు ప్రయాణికులకు మృత్యు శకటాలుగా మారుతున్నాయి. మితిమీరిన లోడుతో ఈ వాహనాలు రోడ్డుపై వెళ్తుంటే ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాకుండా రోడ్డుపై విద్యుత్ వైర్లు, స్తంభాలకు వాహనాలు తగులుకోవటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక ఊక ప్రయాణికుల కళ్లలో పడితే ప్రత్యక్ష నరకమే కనిపిస్తోంది. నియోజకవర్గంలోని కాకినాడ, కోటిపల్లి ప్రధాన రహదారిలో ఊక వాహనాల జోరు నిత్యకృత్యమైంది. గతంలో రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే ఈ లారీలు, ట్రాక్టర్లు ఇటీవల పగటి వేళలోనూ యథేచ్ఛగా తిరుగుతున్నాయి. రద్దీగా ఉండే సమయాల్లోనూ ఊక వాహనాలు తిరగడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు వాపోతున్నారు. మండలంలోని గొల్లపాలెం, కాజులూరు, జగన్నాథగిరి, కోలంక గ్రామాల్లో రైస్‌మిల్లుల నుంచి ఇటుక బట్టీలకు ఊక, బూడిద రవాణా జరుగుతుంది. లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలకు ఇరువైపులా బరకాలు కట్టి ఊక, కాలిన బూడిద లోడు చేయడం వల్ల వాహనం సైజు భారీగా మారి రోడ్డు ఆక్రమిస్తున్నాయి. దీనివల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తప్పించుకుని ముందుకు వెళ్లేందుకు వీలు లేకుండా పోతుందని ప్రయాణికులు చెబుతున్నారు. వాహనాలు వేగంగా వెళ్లే సమయాల్లో ఊక, బూడిద ఎగిరి వచ్చి వెనుక వచ్చే వాహనదారుల కళ్లలో పడుతుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఈ వాహనాలు రోడ్డుపై ప్రయాణించే సమయంలో పైన విద్యుత్ తీగలకు తగులుకుని మంటలు సంభవించడం, లేదా ఈ వాహనాలు మలుపులు తిరగలేక విద్యుత్ స్తంభాలను ఢీకొనడం తరచూ జరుగుతున్నాయి. కాజులూరులో కొన్ని రోజుల కిందట రోడ్డుపై వెళ్తున్న ఊక ట్రాక్టర్‌కు పైన విద్యుత్ తీగలు తగులుకుని మంటలు రాగా స్థానికులు గమనించి సకాలంలో ఆర్పివేశారు. ఇటీవల కోలంకలో యానం, ద్వారపూడి రహదారిపై ఊక ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా అది విరిగి నేలపై పడింది. ఆ సమయంలో గ్రామంలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. అధికారుల కళ్ల ముందే నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రహదారులను ఆక్రమిస్తున్నాయి



లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలకు ఇరువైపులా బరకాలు కట్టి ఊక, కాలిన బూడిద లోడు చేస్తున్నారు. వాహనం సైజు భారీగా మారి రోడ్డు ఆక్రమిస్తుంది. ఇవి ముందు వెళ్తుంటే ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నాం.

– చింతపల్లి నాగేంద్రప్రసాద్, కుయ్యేరు

కళ్లలో పడుతోంది



ఊక, బూడిద లోడుచేసిన వాహనాలు రోడ్లపై వేగంగా వెళ్లే సమయాల్లో ఊక, బూడిద ఎగిరి వచ్చి వెనుక వచ్చే వాహనదారుల కళ్లలో పడుతుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొని ప్రమాదాల పాలవుతున్నారు.

– నల్లమిల్లి శ్రీవిష్ణురెడ్డి, మొగలిపాలెం

కేసులు పెడుతున్నాం



పరిమితికి మించిన లోడుతో రోడ్లపై ప్రయాణించే వాహనాలకు జరిమానాలు విధిస్తున్నాం. కొన్ని సందర్భాలలో కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తున్నాం. ప్రయాణికులకు ముందు వెళ్లే వాహనంతో ఇబ్బంది కలిగినట్టు అనిపిస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయవచ్చు.

– ఎం.తులసీరామ్, ఎస్సై, గొల్లపాలెం

బాధిత కుటుంబానికి సాయం



సూర్యనారాయణ భార్యకు చెక్కు అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

కె.గంగవరం: పామర్రు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ దూడల సూర్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చిన ఆర్థిక సాయం రూ. 5.15 లక్షల చెక్కును రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రామచంద్రపురంలోని పార్టీ కార్యాలయం వద్ద సూర్యనారాయణ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వాసంశెట్టి సూరిబాబు, కోట సత్యనారాయణ, కపిల్, పంచాయతీ కార్యదర్శి సీతారామయ్య చౌదరి, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5 వేల జరిమానా

ఆత్రేయపురం: బొబ్బర్లంక వద్ద అనుమతులు లేకుండా జేసీబీతో ఇసుక లారీలో ఎగుమతి చేస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. లారీని తహసీల్దార్ కార్యాలయానికి తరలించగా రూ.5 వేల జరిమానా విధించారన్నారు.